## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలోని గూపన్ పల్లి బైపాస్ రోడ్డులో గల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో భాదీత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సిరికొండ మండలం దుప్య తండాకు చెందిన మాలవత్ రమేష్ గత 10 నెలల క్రితం తన పొలంలో పనిచేస్తూ ఉండగా పొలంలో కరెంట్ షాక్ తగిలి మరణించాడు. మాలవత్ రమేష్ మరణించిన విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జిల్లా విద్యుత్ శాఖ ద్వారా నిజామాబాదు రూరల్ క్యాంపు కార్యాలయంలో 5 లక్షల చెక్కును అతని భార్య మాలవత్ నీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు ఉమ్మాజీ నరేష్, దుప్య తండా సర్పంచ్ చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి రహిత ఇందూరుగా తీర్చిదిద్దుతాం

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మన నిజామాబాద్ జిల్లాని అవినీతి రహిత ఇందూర్ గా తీర్చిదిద్దుతామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని 50వ డివిజన్ శివాజీ నగర్‌లో శనివారం భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జగదీష్ కులకర్ణి కి మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ లో సూర్య నారాయణ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కదానిని కూడా అమలు చేయని చేతగాని, అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలను ఎదుర్కొనే నైతిక హక్కు లేదన్నారు. మన ఇందూర్ -- మన మేయర్ అని భారతీయ జనతా పార్టీ నినాదం వినిపిస్తేనే ఇతర పార్టీలకు గుబులు పుడుతోందని అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక వర్గానికి భయపడి "ఇందూరు" అనే పేరు కూడా పలకలేని పరిస్థితిలో ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్, మైనార్టీ పార్టీలు, ఎంఐఎం మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో పెద్ద పెద్ద మాటలు చెప్పినప్పటికీ, ఒక్క నిరుపేద కుటుంబానికి కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందించలేని చేతకాని మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా పాలనపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో అభివృద్ధి లేకుండా అవినీతి కమీషన్లు, కాంట్రాక్టర్లకే ప్రాధాన్యం ఇచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిందూ దేవతలను అవమాన పరుస్తున్న పార్టీలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను భారతీయ జనతా పార్టీ ఒక ఛాలెంజ్‌గా స్వీకరించి, మెజార్టీ స్థానాల్లో గెలిచి మేయర్ పీఠాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కిట్టు పాటిల్, బాలకృష్ణ, దీపక్, అల్లాడి రాజు తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, 50వ డివిజన్‌కు చెందిన పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



# భీమ్‌గల్‌ను మున్సిపాలిటీగా మార్చింది, అభివృద్ధి చేసింది బీయర్ ఎస్సే









భీమ్ గల్, బతుకమ్మ:భీమ్ గల్ గ్రామాన్ని మున్సిపల్ పట్టణంగా అప్గ్రేడ్ చేసింది బీయర్ ఎస్ పార్టీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 3, 5, 6 వార్డులలో టిఆర్ఎస్ (బీయర్ ఎస్) పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం నిర్వహించిన స్ట్రీట్ కార్నార్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ భీమ్‌గల్‌ను గ్రామ స్థాయి నుంచి మున్సిపాలిటీగా మార్చడమే కాకుండా పట్టణంగా మార్చి సుమారు రూ. 200 కోట్ల తో అభివృద్ధి నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. గత 10 ఏళ్లలో జరిగిన అభివృద్ధి వల్ల భీమ్‌గల్‌లో భూముల మార్కెట్ విలువ పెరిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.ఈ పెరిగిన మార్కెట్ విలువే భీమ్ గల్ లో గతంలో జరిగిన అభివృద్ధి కి తార్కణం అని అన్నారు.

భీమ్‌గల్‌లో మిగిలిపోయిన అదనపు పనుల కోసం తాను రూ.10 కోట్ల రూపాయలు మంజూరు చేశానని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షపూరితంగా ఆ పనులను రెండేళ్లుగా నిలిపివేసిందని ఆరోపించారు. పనులు ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బంది పెట్టి, ఎన్నికలు రాగానే శంకుస్థాపనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం లింబాద్రి గుట్టకు వెళ్లే రోడ్డును సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో పాటు 4 లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు గిరి ప్రదక్షిణ రోడ్డును కూడా పూర్తిచేశామని గుర్తు చేశారు. అలాగే నిజామాబాద్, ఆర్మూర్ వెళ్లాల్సిన అవసరం లేకుండా భీమ్‌గల్‌లోనే వైద్యం అందాలనే ఉద్దేశంతో రూ. 40 కోట్ల నిధులతో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేశామని, అయిన మిగిలిన పనులు చేయకుండా ఆసుపత్రిని ప్రారంభించకపోవడం దురదృష్టకరమన్నారు.రూ. 6 కోట్లతో ప్రారంభించిన మార్కెట్ పనులు, భీమ్‌గల్ బస్ డిపోను కూడా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. బస్ డిపోలో బస్సులు లేవని, కంట్రోలర్లు కూడా లేరని అక్కడ బర్లు పడుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి 25 నెలలైనా ఒక్క రూపాయి ఇవ్వలేదని, అంటే ఒక్కో మహిళకు రూ.62,500 బాకీ పడిందని వ్యాఖ్యానించారు. అవ్వతాతలకు రూ.4000 రూపాయల పింఛన్ ఇవ్వక గత 25 నెలల్లో రూ. 50 వేలు బాకీ పడింది అన్నారు. తులం బంగారం, రైతు రుణమాఫీ, రైతుబంధు హామీలు అన్నీ మాటలకే పరిమితమయ్యాయని తెలిపారు. బీజేపీకి ఓటు వేసి ఓటును వృథా చేసుకోవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్రానికి అధిక పన్నులు వెళ్తున్నా, కేంద్రం మాత్రం నిధులు కేటాయించడంలేదని, రాష్ట్రం నుండి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని విమర్శించారు.

బీయర్ ఎస్ పార్టీ అభ్యర్థులు ప్రజలతో కలిసి ఉంటారని, సమస్య వచ్చిన వెంటనే ప్రజల పక్షాన నిలబడతారని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుని భీమ్‌గల్ భవిష్యత్తు కోసం కారు గుర్తుపై ఓటేసి బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులు బోదిరే లావణ్య నర్సయ్య, నీలం లావణ్య గంగాధర్, మూత లింబాద్రిలను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ వార్డు లో రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్ సభలో ప్రశాంత్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత నాలుగైదు రోజులుగా భీమ్‌గల్‌లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే పనులను ఆపివేసిందో, ప్రజలను ఎలా మోసం చేసిందో నేను వివరిస్తుండడం తో నేను చెబుతున్న నిజాలకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి, ఎక్కడ ఓడిపోతామో అన్న భయంతో కాంగ్రెస్ నాయకులు నాపై మాటల దాడులకు తెగబడుతున్నారన్నారు.





హైదరాబాద్ నుండి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిపించి భీమ్‌గల్‌లో ప్రెస్ మీట్ పెట్టించారని, ఈ ప్రెస్ మీట్ లో ప్రశాంత్ రెడ్డి భీమ్‌గల్‌కు ఏమీ చేయలేదని ఆయనతో అబద్ధాలు చెప్పించారన్నారు. పక్కనే ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చెవిలో ఊదితే, ఒక బాధ్యతాయుతమైన మంత్రి అయి ఉండి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.



బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ సునీల్ రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ లు అనిల్, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ లాంటి నాయకులు ప్రభుత్వ కార్లు, పోలీసు జీపులు వేసుకొని నాపై దండయాత్రకు వస్తున్నారన్నారు.



నేను నిజాలు చెబుతుంటే నన్ను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన, ప్రజల కోసం తాను వాస్తవాలను వెల్లడిస్తూనే ఉంటానన్నారు. మొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు భీమ్‌గల్ వచ్చినప్పుడు మీరు ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఏది అని ప్రశ్నించినందుకు మమ్మల్ని పోలీసులతో దారుణంగా కొట్టించారన్నారు. లాఠీలతో దాడి చేయించడమే కాకుండా, తిరిగి మాపైనే (32 మందిపై) అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎన్నికల్లో మాట్లాడకూడదని బైండోవర్లు చేస్తున్నారన్నారు. దేవుడి సాక్షిగా చెబుతున్నాను, నేను చెప్పే ప్రతి మాట అక్షర సత్యం. ఈ దౌర్జన్యాలను ప్రజలు గమనించాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కోరారు.



